భౌ

పుప్పల నరసింహం

ఇంకా తెల్లగా తెలవారలేదు. గోరు కొయ్యల కదలికలను చూసి కాలమానాన్ని కొలిచే కొమురయ్య అప్పుడే నిద్రలేచి, దగ్గుతూనే చుట్ట ముట్టించి, చెంబు చేత పట్టుకుని అలవాటైన దారి వెంట తన స్వగ్రామం జిన్నారంలో నడుస్తూ ఉన్నాడు.

తాను నడిచే దారి ఇరుకైనప్పటికీ ఇప్పుడు విశాలంగా కనిపిస్తోంది. నిజానికి ఎద్దుల బండి వెళ్లేంతటి దారి అది. అదేమిటో గాని ఉదయం పూట నీళ్ళ కుండతో కోడలు ఎదురొస్తే ఎదురు నడవడానికి వీలు కాదు - పిల్ల బాటలా మారిన ఆ దారి రెండు పక్కల ముళ్ల చెట్లు, రాళ్లు రప్పలు పడి ఉన్నాయి - అదే దారి ఇప్పుడు విశాలంగా కనిపిస్తోంది.

కొమురయ్య తెల్ల వారాక చేయవలసిన కార్యక్రమం గురించి ఆలోచిస్తూ నడుస్తూ ఉన్నాడు.

కొమురయ్య నయను యాభై సంవత్సరాలకు పైనే ఉంటుంది. ఆయన ధరించిన సైన్ బట్ట బనియన్, ఎర్రంచు తూఫ్రాన్ ధోవతి కాలి బోయినప్పటికీ చీకటిలో తెల్లగా కనిపిస్తున్నాయి. ఆయన కుడి చేతి 'రెట్ట'కు వెండి కడెం వెలుగుతూ ఉంది. చేతి వేళ్ల కున్న రాగి ఉంగరాల మాట ఏమో గాని వెండి ఉంగరాలు తెల్లగా తమ ఉనికిని తెలుపుతున్నాయి. నిలువెత్తు మనిషిలా కనిపించే కొమురయ్య, కాళ్లకు లావుపాటి చెప్పులతో అడుగులేస్తూ ఉన్నాడు.

అలా అడుగు లేస్తూనే కొమురయ్య ఆలోచిస్తూ ఉన్నాడు. తెల్లవారి సర్పంచ్ మాధవరెడ్డితో 'పుల్లెర' విషయం ఏ విధంగా కదపాలి? .... ఎట్లా ఆలోచించినా ప్రారంభం కుదరడం లేదు. ఫలానా తీరుగా ప్రారంభిస్తే ఫలాన తీరుగొ అంటాడేమో, ఈ విధంగా అడిగితే, ఆ విధంగా అంటాడేమో..... ఇట్లా తనలో తానే ప్రశ్నలు వేసుకుని, సమాధానాలు చెప్పుకుంటూ అడుగు లేస్తూ ఉన్నాడు. కాని ఏ ప్రారంభం కుదర లేదు...

ఇంతలో సందులోంచి ఓ కుక్క 'భౌ' మని మీది కొచ్చింది. కొమురయ్య ఆలోచనలు చెల్లా చెదురయ్యాయి. దాంతో కుక్క మీదకు చెంబుతో పాటే చెయ్యెత్తి ''కొత్త లేదు - పాత లేదు - భౌ మని ఎగురడేనానే?.... నీయవ్వ'' అన్నాడు.

కుక్క ఆ గొంతు ధ్వని గుర్తు పట్టి తోక టవ



టవ ఆడిస్తూ కుయ్ కుయ్ మని కూనిరాగం తీయసాగింది. కొమురయ్య వెంట నడవసాగింది. నాలు గడుగులు అతనితో పాటే వేసి తప్పు తెలుసు కున్న దానిలా వెనక్కు వెళ్లి పోయింది.

కొమురయ్య వీధి దాటి ఊరావలకు నడిచాడు. చిమ్మెట్లు ఎడ తెరిపి లేకుండా అరుస్తూ ఉన్నాయి. చెట్ల కొమ్మలపై నుంచి పక్షుల చప్పుడు వినిపిస్తూ ఉంది. కాని కొమురయ్య మనసుకు అవేమీ పట్టినట్టు లేదు - ఆ ధ్యాసే లేదు.

ఊర్లో ఆ మూల ఈ మూల ఏవేవో చప్పుళ్లు వినిపిస్తూ ఉన్నాయి. కొమురయ్య నడిచిన దారిలో మాల వాడ దగ్గర దశరథ రామిరెడ్డి పటేల్ సైకిల్‌పై నుంచి దిగకుండానే ఓ గుడిశె కేసి చూస్తూ,

'' చంద్రిగా.... ఒరేయ్ చంద్రిగా.... ఇంకా తెల్లార లేదు రా?.... నీ యమ్మ ఏం పుట్టుక పుట్టినవ్ రా? ఇంకా పంటావు రా?....నడువ్, గోదల నిడవాలె నడూ....'' అని పిలుస్తూ ఉన్నాడు.

కొన్ని క్షణాల తరువాత ఓ పాత తలుపు తెరుచు కున్న చప్పు డయింది. ఆ తరువాత ఓ ముసలి స్త్రీ '' ఇంతకు ముందే పోయిండు పటేలా - ఇప్పుడు బాయి కాడికి పోయిండొచ్చు'' అంది.

''నేన్ ఆడికెల్లే వస్తున్న కనిపియ్యక పాయెనూ...?'' నిందమోపుతున్నట్టు ఎదురు ప్రశ్న వేశాడు దశరథరామిరెడ్డి.

''ఇట్ల పెద్ద బాయి మీది కెల్లి పోయింటడు పటేలా'' అంది ఆమె.

''తత్ నీయమ్మ...'' అంటూ దశరథరామిరెడ్డి అక్కడి నుంచి సైకిల్ మలుపుకుని వెనక్కి తిరిగాడు. ఆయన గొణగడంలో నిరాశ, అసహనం ధ్వనించాయి.

కోళ్లు కూస్తున్నాయి - తలుపులు తెరుచుకుంటున్నాయి. ముసలి వాళ్ల దగ్గు వినిపిస్తూ ఉంది. చంటి పిల్లల ఏడ్పు వినిపిస్తూ ఉంది. తల్లుల సముదాయింపు చెవిన పడుతూ ఉంది. కాకులు అదే పనిగా అరుస్తూ ఉన్నాయి. లేగ దూడలు ఆకలితో కట్లు తెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. అప్పుడే పందులు ఊర్లోని మోరీల్లోకి ఆహారం కోసం వచ్చేశాయి. గాడిదలు మాత్రం పాత గోడల్లా చలనంలేకుండా నిలబడి కునుకు తున్నాయి. చేద బావి గిలకల చప్పుడు వినిపిస్తూ ఉంది. వాకిళ్లు ఊడుస్తున్న చీపిరి చప్పుడు వినిపిస్తూ ఉంది.... ఈ లోపుగా కొమురయ్య కాలకృత్యాలు ముగించుకున్నాడు.

సర్పంచ్ మాధవరెడ్డి ఇంటి ముందర గాయిది మల్లమ్మ వాకిలి ఊడుస్తూ ఉంది. బాగా పొట్టిదై పోయిన చీపిరితో మల్లమ్మ పూర్తిగా వంగి వాకిలి ఊడుస్తూ ఉంది. ఎన్నో రోజుల నుంచి ఆ పాత చీపిరి పారేసి కొత్తది అడుగుదా మంటే పటేలమ్మ అడగడానికి అవకాశమే ఇవ్వలేదు. మొన్న ఎప్పుడో అడిగినప్పుడు చీపిరి పుల్లలను కోసుక రమ్మని మల్లమ్మకే పని చెప్పింది పటేలమ్మ. ఇక చేసేది ఏమి లేక ఆ మొండి చీపిరితోనే వంగి వంగి ఊడుస్తూ ఉంది. '' నడుములు పోతున్నయ్'' అని తనలో తాను గొణుక్కోవడమే గాని పైకి అనలేక పోతోంది మల్లమ్మ - పైకి అంటే ఎవరు విని ఎన్ని తిట్లు తిడతారో అని అట్లాగే ఊడ్వసాగింది.

ఎదురింటి తలుపు తెరు చుకుంది. ఆ చప్పుడుకు మల్లమ్మ తలపై కొంగు మరింత నిండగా వేసుకుని ఊడ్వ సాగింది. అంతే కాని తల ఎత్తి తలుపు వైపు చూడలేదు.

కొన్ని క్షణాల తరువాత మాత్రం ''ఏమే గాయిద్దానా, నిన్న నీ కొడుకు మాట చెట్లకు నీళ్లు పార పెట్టేది ఇడిసి పెట్టి సినిమకు పోతాడు?... గిదేనా లెక్క? గిదేనా తర్వాయి? ఆ (....'' ఉరిమి నట్టు అన్న ఆ మాటలకు తల తిప్పక తప్పలేదు - కాని నేరుగా చూడలేక పోయింది.

అదేమి టో గాని ఆ గొంతు ఏదో లోహపు చప్పుడులా ధ్వనించింది. ఆ ధ్వనికి, ఆ దబాయింపునకు ఎదర ఉన్న ఆ ఆకారం చూసి సమాధానం ఇవ్వడం మల్లమ్మ తరం కాలేదు. జవాబు ఇవ్వకుండా అలా నిల్చోవడం నచ్చని మాధవరెడ్డి మరింత దబాయింపుగా ''సప్పుడు జెయ్య వేమే?... జీతం ఉండెటప్పుడేమో నంగి నంగి మాట్లాడ్తారు, అప్పు తీరేదాక ఎక్కడికి పోను పటేలా అని ధర్మాలు, ఖర్మాలు తింటారు. జీతంల చేరినంక వారానికి రెండు దినాలు 'నాగ' లయితయి - ఏ మన్న అంటెనేమో కడుపు నొప్పి లేచింది పటేలా, కాళ్ల నొప్పి లేసింది పటేలా అని బొంకుత రు....'' వ్యంగ్యంగా ఆ మాటను సాగ దీశాడు. అదే ధోరణిని కొనసాగిస్తూ -

'' ఈ బొంకుడు, గింకుడు నా దగ్గర పనికి రాదు - ఇయ్యాల వాడు జీతంలకు రాకపోతే వారం రోజుల జీతం పట్టుకుంట - ఇగ నీఇష్టం - వానిష్టం. అటెన లబ లబ మొత్తుకుంటె నాతోని గాదు - ఏ మంటున్న?'' అని రెట్టించాడు.

మామూలుగా అడిగితేనే గొంతు పెగలని మల్లమ్మ, రెట్టించి అడిగే సరికి తనలోకి తాను ముడుచుక పోయి లో గొంతులో ''పోరనికి చెప్త పటేలా'' ఉంది.

''చెప్పుడు కాదు - ఇయ్యాల వాడు బాయికాడ కనిపియ్యకపోతే వాణ్ణి ఏం చేస్తనో సూడు....'' అని కోపంగా అన్నాడు.

మల్లమ్మ మౌనంగా ఉండి పోయింది.

మాధవరెడ్డి చేతిలోని గొలుసును కుక్క లాగుతూ ఉంది. దాంతో ఆయన ముందుకు అడుగేయక తప్పలేదు.

మల్లమ్మకు సర్పంచ్ మాధవరెడ్డి కన్నా ఆ కుక్క అంటేనే ఎక్కువ భయం. మొదట్లో అది కుక్క కాదు ఇంకేదో జంతువు అనుకుంది మల్లమ్మ. కాని క్రమంగా నమ్మక తప్పలేదు. నమ్మాక ఆ కుక్కను మాత్రం నమ్మడానికి వీలు కావడంలేదు. అందు కనే అది ఎక్కడున్నా దూరం దూరం నుంచే మసులు కోవడం అలవాటైంది. మల్లమ్మే కాదు - ఆ ఇంటికి ఎవరొచ్చినా ఆ కుక్కను చూసి దూర దూరంగానే ఉంటారు.



మాధవరెడ్డికి కావలసింది కూడా అదే. అందు కోసమే పట్నం లోని తన చుట్టాల దగ్గర నుంచి ఆ కుక్కను తీసుకొచ్చాడు. ఇప్పు డది తొమ్మిది నెలల కుక్క అంటే ఎవరికి నమ్మ బుద్ధి కాదు - తొమ్మి దేళ్ల పైబడిన కుక్కలా లావుగా, ఎత్తుగా ఎదిగి, ఎద్దులా ఉంది. మల్లమ్మ అప్పుడప్పుడు ఆ కుక్క గురించి ఇతరులకు చెప్పేటప్పుడు ''ఎద్దు లెక్క ఉన్నది ఆ కుక్క'' అని అంటూ ఉంటుంది.

విశాలమైన వాకిట్లోకి మాధవరెడ్డి హవాయి చెప్పులతో అడుగు పెట్టాడు. మనుషులు ఎవరు ఏమి చెప్పినా వినడం అతనికి అలవాటు లేదు - తన మాట ప్రకారమే ప్రతీదీ జరగాలన్నది ఆయన అభిమతం - ఒక వేళ ఇతరుల మాట విన్నా ఆ మాట - ఆలోచన సమంజస మనిపించదు - కాని తన కుక్క గొలుసుతో ఎటు లాక్కెళ్లినా అనునయిస్తూ, బుజ్జగింపు మాటలు మాట్లాడుతూ అటు వెళుతూ ఉంటాడు. అది మాత్రం

పోయడానికి, మలవిసర్జన చేయడానికి అనువైన చోటు కోసం ఎన్నో స్థలాలను వెతుక్కుంటూ ఉన్నా విసుక్కోక దాని వెంట వెళ్లడం అలవాటు.

అలాంటి మాధవరెడ్డికి దాదాపు యాభై సంవత్సరాలుంటాయి. అయితే ఆయన ముప్పై ఐదు సంవత్సరాల వాడిలా కనిపిస్తాడు. ఖద్దరు అంగీ తొడిగి, చేనేత లుంగీ కట్టి చేతికి బంగారు బటువులతో, బంగారం రంగు గడియారంతో అలా ఉదయం పూట కుక్కతో పాటు తిరగడం ఆయన అలవాటు - దారిన వెళ్లే వాళ్లు భయంతో, భక్తితో, మొహమాటంతో దండలు పెడుతూ ఉంటారు. దర్జాగా తల ఆడించి ఊరు కోవడం ఆయనకున్న మరో అలవాటు.

కొమురయ్య తలనిండా రుమాలు చుట్టుకొని, భుజాలపై గొంగడేసుకుని, నోట్లోకి వస్తున్న మీసాలను సరి చేసుకుని, "మంద" కాడికి వెళ్లేప్పుడు తీసుకెళ్లే కర్రను తీసుకుని, లావుపాటి



చెప్పులు వేసుకుని బైలు దేరాడు.

ఊరంత సందడిగా ఉంది. ఎవరి పనులపై వారు తిరుగుతూ ఉన్నారు. అల్లం మొరబ్బా అమ్మే దస్తగిరి బుట్టి పట్టుకుని తనదైన ప్రత్యేక పద్ధతిలో 'అల్లం మొరబ్బల్లం మొరబ్బా' అంటూ వేగంగా అడుగు లేస్తూ ఉన్నాడు. 'చేనే ఉంటానే...' అంటూ సైకిల్ పై వ్యాపారస్తుడు తిరుగుతున్నాడు. అతని సైకిల్ వెనకాల పాత ఇనుప సామగ్రి కనిపిస్తోంది. ఎవరో ముసలామె గొణుగుతూ, ఎవరినో శపిస్తూ బజారు వైపు పోతూ ఉన్నది. వీథిలో నిలబడి ఓ తల్లి, ఆడుతున్న తన కూతురిని కూక లేసి పిలుస్తోంది. కట్టెల మోపుతో అడివి నుంచి ఊర్లోకి వచ్చిన లంబాడి యువతి వీథుల్లో తిరుగుతోంది. బావిలో చేతాడు తెగి పడిందని ఎవరో 'పాతాళ గరిగె' తీసుకెళుతూ ఉన్నారు. పదేళ్ల పిల్ల తలపై పండి బగోనితో నడుస్తూ ఉంది.

కొమురయ్య నడుస్తూ ఉన్నాడు. నోట్లోని చుట్ట కాలుతూ ఉంది. అతని ఆలోచనలు ఇప్పుడు ఉదయంలా గజిబిజిగా లేవు. 'పుల్లైర విషయం అడుగుదాం' అని నిశ్చయించుకుని బైలు దేరాడు. ఎదరకు పోక ముందే అన్ని సంగతులు తనే అనుకోవడం బాగుండదని అడుగు లేస్తూ ఉన్నాడు.

దారిలో కావలి ముత్యాలు ఎదురై 'దండం బావ' అన్నాడు.

కొమురయ్య క్షణ మాగి "దండమోయి ముత్యాలు - మంచి గున్నావా?" అని అడిగాడు.

"ఉన్నం గిట్ల మీ దయల మాగంజి తాగుకుంట."

"ఏమో అట్ల వడితివేమోయ్ పిలగా"

"అంతే కద బావ - సర్కారు నౌఖరి అన్నట్టే గాని సర్రాసుగ ఎప్పుడూ జీతం వొచ్చింది లేదు. వొచ్చినా కడుపు నిండది - కాలు నిండది"......" అన్నాడు యాభై ఏళ్లు దాటిన కావలి ముత్యాలు.

"కూసున్న కాడికి జీతం వొచ్చే నువ్వే అట్ల అంటే, ఇత్తుకు ఇతు మా లెకుంట కష్టపడ్డటోడు ఎట్లనాలే? గుల్ల గుట్టకు, చెట్టు చెట్టుకు తిరిగే నాయనుంటోడు ఏమనాలే?" అనడిగాడు.

"ఏమంటడు, ఎల్లకుంటె అవ్వు నవ్వుజేస్తుడు కడుపు నింద తింటడు......' అని మాట పూర్తి చేయకముందే కొమురయ్య అందుకొని "ఊరంత నీ చేతుల ఉంది. ఊరికి కావలి కాని వయితివి. మరి అప్పునప్పు నీకు దొరుకదా వోయి?" అనడిగాడు.

"అప్పు మాట అంటే అవత లుండుమంటరు...."

"అందరి నంగతి గంతే!"

"నా కెరక లేదానే బావ! ఎవని సంగతి జూసినా గిట్లనే ఉన్నది. అవ్ గాని ఏడికో పోతున్నవు?" అనడిగాడు ముత్యాలు.

"సర్పంచ్ దగ్గర్కి పోతున్న - ఉన్నడా?"

"ఏమో బావ! నేను అటు పోలేదు - ఇప్పుడు పోతినాంటే అంబటిళ్ల దాక ఆడనే ఉండుడయితది. అందుకనే జెర కోమటి ఈశ్వరయ్య దుకాణం దాక పోయొస్తనని పోతున్న...."

"సరే ఫో. సర్పంచ్ ఏడికన్న పోకముందే కలువాలే..."

"పొయిరా" అంటూ ముత్యాలు ముందుకు కదిలాడు.

కొమురయ్య సుట్ట ఆర్పి కమీజు జేబులో వేసుకొని అడుగు ముందుకేశాడు.

సర్పంచ్ మాధవరెడ్డి ఇంటి వసారాలో కుర్చీలో కూర్చున్నాడు. అతని పక్కనే [జాతి] కుక్క నాలిక చాచి, చూస్తూ కూర్చున్నది. దాని కళ్లు పళ్లు భయంకరంగా కనిపిస్తున్నాయి. సైగ చేస్తే ఎప్పుడు. ఎదుటి వారిపై పడి రక్కేద్దామా అన్నట్టుగా ఉంది.

కొద్ది దూరంలో కాముని భూతం, కర్రె కాకి, కుంటెను గాడు లాంటి కాశయ్య నిల్చున్నాడు. ఊరి సమాచార మంత సేకరించి సర్పంచ్‌కు అందజేసే కాశయ్యకు గ్రామస్తులు పై మారుపేర్లు పెట్టారు.

కాశయ్య ఏదో చెబుతుండగానే అక్కడికి కొమురయ్య వచ్చాడు.

రాగానే "దండం పటేలా" అని వినయంగా నమస్కరించాడు.

కాశయ్య చెప్పే మాటలను ఆపేశాడు. మాధవరెడ్డి తలుపు వద్ద ఉన్న కొమురయ్య ను చూసి "దండం - ఏం బిడ్డా కొమురయ్య బాగున్నావా?" అని కుశల మడిగాడు.

మాధవరెడ్డి కన్నా వయసులో పెద్దయిన కొమురయ్య వినయంతో "ఏదో మీదయ గిట్లున్న పటేలా" అన్నాడు.

"అరె, కాశయ్య నివ్ ఫో! నీ పని నువ్ జూసుకో పో...."

మాధవరెడ్డి అనగానే కాశయ్య అక్కడి నుంచి కదిలాడు. మాధవరెడ్డి తలుపు దగ్గర ఒదిగొదిగి నిల్చున్న కొమురయ్య నుద్దేశించి "ఏమో పొద్దుగాల పొద్దుగాల వొచ్చినవేంరా?" అనడిగాడు.

"నీ దగ్గరికే వొచ్చిన పటేలా" అని చేతిలోని కర్రను పక్కకు పెట్టాడు.

"నా దగ్గరికా?!" కావాలనే కొంత ఆశ్చర్యంగా అడిగాడు మాధవరెడ్డి.

తిరిగి తనే "నాతోని ఏం పనిరో?" అనడిగాడు.

"ఊరికి పటేల్ వే అయితివి. పని పడదా?" చిరునవ్వు, వినయం కలగలిపి అన్నాడు కొమురయ్య.

"నా తోని ఏం పని పడ్తదిరో? నే నే మన్న సావుకారి నా? పోలీసు పటేల్నా? మాలీ పటేల్నా? నా తోని ఏం పని వడ్తదిరా? నా దగ్గ రే ముందిరా? అవునబ్బ నూర్లకు నూర్ల ఎకరాల భూమి ఉన్న భూ సామినా? నా దగ్గరే ముందిరా బురకలడ్డు !...."

తనను తాను కించపరచు కున్నట్టు పైకి అనిపించినా అందులోనే అందరి కన్నా తానే గొప్ప వాడి ననే భావం తొంగి చూస్తూనే ఉన్నది.

కొమురయ్య ఆ విషయాన్ని గమనించక పోయినా "ఆవన్నీ ఉంటేనే రావాల్నా లేకుంటే లేదా పటేలా?" అని అడిగాడు.

"అగో, ఇయాల రేపు దునియ ఎట్లున్నది రా?"

"దునియ కేం పటేలా తీరుతీరున మార్తది."

"తీరు తీరున మాట ఇడిశిపెట్టు. ఇప్పుడు ఎవడన్న చెప్పిన మాట ఇంటున్నాడు ఊర్లె.... ఎవన్నీ 'అరేయ్' అనొచ్చేటట్టు లేదు, 'తురేయ్' అనొచ్చేటట్టు లేదు - ఒక్కొక్కడు మా అంత మొగాళ్లె లేరని తిరుగుతున్నారు. మూతి మీద మీసం రానోడు గూడా నేనే మొగోణ్ణి అంటున్నాడు - ఏడ 'ఖదర్' ఉందిరా? ఊరు ఖదరే పోయింది. ఊర్లె ఉన్న పెద్ద మనుమల ఖదర్ ఏ ఘన్న ఉన్నాది? ఏం లేదు - పిర్రలకు తుడుసుక పోతున్నారు...." మనసులోని మాటని వెళ్లగక్కి ఆశ్చర్యంతో నోరు తెరిచి చూస్తూ ఉండగా "జమాన అట్లొచ్చింది....." అన్నాడు కొమురయ్య.

మాధవరెడ్డి తేరుకుని "ఏం జమాన రా? ఏట్లె జమాన! చిన్న పెద్ద, మర్యాద, గిర్యాద ఏం లేని జమాన ఎందుకురా? గింత గింత పోరలు - నా కండ్ల ముంగట పుట్టిన పోరలు నువ్వెంత - నీ పోకడెంత అన్నట్టుగ తిరుగుతున్నరు. ఇగ వాళ్లకు ఏం జెప్తవొ చెప్పు?"

"ఇగ అసుంటోళ్లకు ఏం చెప్తం?"

"ఏం చెప్తం? మూసుకోని కూసోవాలె. అంతే? అంతకు మించి మిక్కి లి ఏం లేదు - జీతగాడు నాగలి ఇడిసి సిన్మకు బోయినా ఏం అనొచ్చేటట్టు లేదు - కలుపు కూలోళ్లు అంబటిళ్లకు పన్నెండు గంటలప్పుడు వొచ్చినా ఏ మనొచ్చిటట్టు లేదు. బర్లకాడి పోరడు ఎంత పోరడు అగో వాణ్ణి కూడ పలక రిచ్చేటట్టు లేదు. నాలుగు గట్టిగ అంటే తెల్లారి పనికి 'బంద్'. ఆడు పనికి బందయితే ఆ నోరు లేని జీవాల గోస పోసుకున్నట్టు అయితది. వాడు గాకుంటే ఇంకోడు అనెటట్టుందా? రెండు వేల రూపా[య]లు అడ్వాన్సు ఇస్తామన్నా ఏ పోరడు ఉండెటట్టు లేదు. రెండు వేల రూపా[య]లు అంటే వానికి రెండు రూపా[య]లతో సమాన మయింది. అగో గట్ల నడుస్తున్నది ప్రపంచం. ఇగ ఏం చెప్పుతవో చెప్పు?..."

"అందరు ఒకే తీరు ఉంటారు పటేలా?" అన్నాడు కొమురయ్య కొంత అసహనంగా కదులుతూ -

"నువ్వొక్కనివి అట్ల ఉండక పోతే, అందరు నీ లెక్కనే ఉంటరను కుంటున్నావురా? మొన్న పెద్ద బాయికాడ మల్లిగాడు దుక్కి దున్నుడు ఇడిసిపెట్టి ఏదో ఊరికి బోవాలంట అని పోయిండు - వారం దినాలయి తుంది ఇంత వరకు పత్తాలేదు. మిర్చ పొలం, నీళ్లు లేక వరి ఎండి పోతున్నది. ఎవడన్న జీతగాడు నీళ్లు పెట్టినాడు? - చెప్పు తే చేస్తం! చెప్పకుంటె ఎందుకు చేస్తం? అని ఇరిగేసుకొని కూసుంటరు. థుత్! నీ తల్లి! ఈ యవసం చేసుడు కన్నా ఎటన్న పోవుడు మంచిగుందిరా....." తన నిశ్చితాభిప్రాయం ఇదే అన్నట్టుగా అన్నాడు.

"..............."

కొమురయ్య చూపులు మాధవరెడ్డి పక్కన కూర్చున్న కుక్కపై ఉన్నాయి - ఆ కుక్క కూడా కొమురయ్య నే రెప్ప వాల్చకుండా, తీక్షణంగా చూస్తూ ఉంది. ఆ చూపుల్లో ఏ ముందో గాని కొమురయ్య నోట మాట రాలేదు.

మాధవరెడ్డి మాత్రం కొమురయ్యనుద్దేశించి "అన్నిటికన్నా నీ పనే మంచిగున్నదిరా, భుజం మీద గొంగడేసుకొని, సుట్ట ముట్టిచ్చుకొని, గొర్లను, మేకలను ఎంటేసుకొని గుట్టలు, చెల్కలు తిరిగొస్తే కాల మెల్లి పోతది. రంగ రంగాను కుంట తిని పంటవు...."

"బైటకు సూస్తె అట్లనే అనిపిస్తది పటేలా - గొల్లోనికి గోశి నిండా బాధలే....." అన్నాడు కొమురయ్య .

"ఆ సంగతి అట్లుండనీ గానీ, నీ పనేందో చెప్పు?" అని మాధవరెడ్డి కుర్చీలో సర్దుకుని కూర్చొని అసలు విషయాని కొచ్చాడు.

కుక్క సైతం కొంచెం ముందుకు జరిగి అప్రమత్తంగా కూర్చున్నది.



కొమురయ్య మాత్రం కొంత ఎడం జరిగి వినయంగా, నమ్రతతో "పుల్లెర సంగతి మాట్లాడ్దామని వొచ్చిన పటేలా!" అన్నాడు.

"నల్ల కొచ్చి ముంత దాసుడు ఎందుకు? అప్పుడే అడగొచ్చు కదరా ఈ మాట?"

" ... ..."

"పుల్లెర సంగతి నెలకిందనే చెప్తి కదరా?"

"చెప్పినవ్. కా దంటలేను, పటేలా! కానీ ..."

"ఇం కేందిరా?"

"గంత ఎక్కువాంటే ఎల్లది, పటేలా!"

"ఎల్లకుంటే ఊకోరా! బలవంత మేముంది? నీకు ఎల్ల దనుకుంటె నీ జాగల ను వ్వుంటివి, నా జాగల నే నుంటి. అయిపాయె! నాకు ఎక్కువ పుల్లెర ఇచ్చి ను వ్వెందుకు నష్టపోవాల?"

"బైట ఇం కెక్కడ మేత దొరుకుతలేదు, పటేలా!"

"దానికి న న్నేం చెయమంటవ్ చెప్పు, పటేలా! ఇంటికి సుట్టమొచ్చిండ్రు - ఇన్ని పాలు పొయ్యిమంటె పోస్త! ఆకలయితుంది, బుక్కెడు బువ్వ పెట్టమంటే పెడ్త. అంతేగాని పుల్లెర తక్కువ జేయమంటే మాత్రం నాతోని గాదు. ఇంకెవరి దగ్గరనన్న తీసుకో!"

కట్టె ఇరగకుండా, పాము చావకుండా మాధవరెడ్డి పుల్లెర సంగతి చెప్పేసరికి కొమురయ్యకు వచ్చిన పని కుప్పకూలిపోయినట్టనిపించింది. ఉదయం నుంచి మనసులో ఏదో మూల కలుగుతున్న భయం కాస్తా వాస్తవమైంది. నూటిగా పుల్లెర విషయం అలా చెప్పేసరికి మ రేవిధంగా వేడుకోవాలో తోచడంలేదు. మాధవరెడ్డి దగ్గర కెళ్లి కాళ్లా వేళ్లా బతిమాలుకుందామన్నా పక్కన ఉన్న కుక్క రక్కేస్తుందేమో నన్న అనుమానం, భయం కలుగుతున్నాయి. పుల్లెర సంగతి తేలకపోతే తన గొడ్లు, మేకల మేతకు కష్టమయ్యేటట్టుంది. కొమురయ్య మనసులోనే తర్జన భర్జన పడుతూ, దీనంగా మాధవరెడ్డి వంక చూశాడు.

ముందుగా అతని చూపులకు కుక్కనే కనిపించింది. అప్పు డది కుక్కలా లేదు. తోడేలులా ఉంది. అదను చూసి మందపై పడటానికి సిద్ధంగా ఉన్నట్టు తదేకంగా చూస్తోంది. బలవంతంగా కొమురయ్య మాధవరెడ్డి వంక చూశాడు. విచిత్ర మేమిటంటే అతని చూపులు కూడా ఆ కుక్క చూపుల్లా మింగేసేటట్టు తీక్ష్ణంగా ఉన్నాయి. ఎత్తుకు పై ఎత్తు వేసే నక్క చూపుల్లా ఉన్నాయి. ఆ కళ్లలో ఏ మాత్రం కరుణ, జాలి, దయ కనిపించడంలేదు. మోసగించడంలో, నమ్మించి గొంతు కోయడంలో ఆరితేరిన చూపుల్లా చురకత్తుల్లా ఉన్నాయి.

అయినప్పటికీ అవసరం తనది కాబట్టి మరోసారి అడుగుదామని, "వచ్చే ఏడు పెంచుదురుగాని, ఈ ఏడుకు ఇట్లనే ..." నేలను చూస్తూ అన్నాడు కొమురయ్య.

"వచ్చే ఏడు రాముడెవడో, రాకాసి ఎవడో! అప్పటి మాట ఇప్పు డెందు కనుకోవటం కొమ్మిగా!" అంటూ కుక్క తలపై చెయ్యేశాడు.

"భౌ! భౌ! భౌ!" అని కుక్క నాలుగు కాళ్లపై నిలబడి ఉరుము ఉరిమినట్లు కొమురయ్యపైకి మొరిగింది.

అకస్మాత్తుగా ఆ శబ్దం వినేసరికి కొమురయ్య ఉలిక్కిపడ్డాడు. చెవులు దిబ్బడేసి నట్టయ్యాయి.

ఇక లాభం లే దనుకుని, కొమురయ్య చేతులు జోడించి మాధవరెడ్డి వంక చూశాడు. ఉరిమురిమి చూస్తున్న ఆ కుక్కకు, మాధవరెడ్డి పటేలుకు ఏ మాత్రం తేడా కనిపించడంలేదు. రెండు జాతి కుక్కలను చూస్తున్నట్టుగానే ఉంది. మనసు బరువెక్కి కళ్లు మూసుకున్నాడు కొమురయ్య. అయినా రెండు జాతి కుక్కల ఆకారం మనసులో మెదులుతూనే ఉంది.

★